నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
10 | మహబూబ్‌నగర్, బుధవారం 26 మార్చి 2025 | MAHABUBNAGAR NARAYANPET

దాశరథి రచనలు స్ఫూర్తిదాయకం

దాశరథి శతజయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, మార్చి 25 : దాశరథి కృష్ణమాచార్య రచనలు ఈ తరానికి, రాబోవు తరాలకు స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి స్వగృహంలో సాహితీ కళా వేదిక, తెలంగాణ వికాస సమితి సంయుక్త ఆధ్వర్యంలో దాశరథి శత జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29న సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్‌హాల్‌లో శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్న తెలిపారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా దేశపతి శ్రీనివాస్, విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీలు గోరెటి వెంకన్న, సురభి వాణీదేవి, నవీన్‌కుమార్‌రెడ్డి, తెలుగు శాఖ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, నిజాం కళాశాల ప్రొఫెసర్ శరత్‌చంద్ర, మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, తెలంగాణ వాదులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణనాయక్, వాకిటి శ్రీధర్, పలుస రమేశ్‌గౌడ్, ఉంగ్లం తిరుమల్, మహేశ్వర్‌రెడ్డి, అశోక్, పలుస శంకర్ గౌడ్, నారాయణరెడ్డి, బైరోజు చంద్రశేఖర్, నాగరాజు, చిట్యాల రాము, జోహెబ్ పాల్గొన్నారు.

ముక్కిడిగుండానికి బ్రిడ్జి కల సాకారం

కేసీఆర్, కేటీఆర్, బీరం హర్షవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ముక్కిడిగుండం గ్రామస్తులు

- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు
- బీఆర్ఎస్ హయాంలో నిధులు విడుదల
- కేసీఆర్, కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే బీరం చిత్రపటాలకు క్షీరాభిషేకం

కొల్లాపూర్ రూరల్, మార్చి 25 : కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామస్తులు వానొచ్చిందంటే వాగు దాటాలంటే అష్టకష్టాలు పడేవారు. అప్పటి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పెద్ద వాగుపై వరదల కారణంగా ప్రజలు పడుతున్న కష్టాలను స్వయంగా చూసి చలించి పోయారు. వెంటనే స్పందించి పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం అవశ్యకతను అప్పటి మంత్రి కేటీఆర్ సహకారంతో కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బ్రిడ్జి నిర్మాణానికి రూ.9కోట్లు మంజూరయ్యాయి. 13 ఏప్రిల్ 2023న అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి , అప్పటి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నేడు బ్రిడ్జి పనులు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధమైంది. దీంతో ముక్కిడిగుండం గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కేసీఆర్, కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే బీరం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎంతో మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు ఈ ప్రాంతంలో పనిచేసినా మా గ్రామానికి బ్రిడ్జి నిర్మించలేదన్నారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక కృషితో బ్రిడ్జి సాధించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంచందర్ యాదవ్, మాజీ సర్పంచ్ దశరథం, వేణుయాదవ్, బాలునాయక్, మల్లయ్య, శేషన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలి

వనపర్తి మండలం నాచహల్లిలో సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

- నాచహల్లి సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

వనపర్తి, మార్చి (నమస్తే తెలంగాణ) 25 : వ్యవసాయ పొలాలకు లోఓల్టేజీ లేకుండా నాణ్యమైన కరెంట్‌ను సరఫరా చేయాలని నాచహల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి మండలం నాచహల్లి, సవాయిగూడెం, పెద్దగూడెం, పెద్దగూడెంతండాలకు చెందిన రైతులు నాచహల్లి సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రీఫేజ్ కరెంటు సక్రమంగా లేక పోవడం వల్ల యాసంగిలో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లు ఎలాంటి కరెంట్ సమస్యలు లేకుండా పంటలు పండించుకున్నామని, కాంగ్రెస్ రాగానే కరెంట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయని ఆరోపించారు. 20 రోజుల పాటు నాణ్యమైన కరెంట్‌ను సరఫరా చేస్తే పంటలు చేతి కొస్తాయని విద్యుత్ అధికారులు స్పందించి నాణ్యమైన కరెంట్‌ను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈ చంద్రశేఖర్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వ్యవసాయానికి త్రీఫేజ్ కరెంట్ సక్రమంగానే ఇస్తున్నామన్నారు. గతంలో రాత్రి 1:43 నిమిషాల నుంచి త్రీఫేజ్ లైన్ ఇచ్చేవాళ్లమని, రైతుల విజ్ఞప్తి మేరకు ఈరోజు నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేజ్ కరెంటు ఇచ్చి రైతులను ఆదుకుంటామన్నారు. రైతుల ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు ధర్మనాయక్, మాణిక్యం, నరేశ్‌కుమార్, మాధవరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కృష్ణనాయక్, రూప్లా నాయక్, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంపై గుమ్మడం రైతుల ఆగ్రహం

గుమ్మడం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పెబ్బేరు, మార్చి 25 : పెబ్బేరు మండలంలోని గుమ్మడం 33/11కేవీ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్‌లో తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో విసిగిన రైతులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల మరమ్మతులకు గురైంది. దీంతో గత మూడు రోజులుగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోక పోవడంతో గుమ్మడం, తిప్పాయిపల్లికు చెందిన పలువురు రైతులు సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. నీళ్లు లేక ఎండిన వరి పైరును చూపెడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేరు చేయించి పంటల సాగుకు నీరందించాలని పంటలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి వెళ్లడంతో రెండు రోజుల్లో విద్యుత్‌ను పునరుద్ధరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

నష్టపరిహారం అందించాలి

- పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి
- ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- హన్వాడ మండలం నాయినోనిపల్లిలో దెబ్బతిన్న వరి పంటల పరిశీలన

నాయినోనిపల్లి గ్రామ శివారులో వరి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, మార్చి 25 : వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నాయినోనిపల్లి గ్రామంలో ఆకాల వర్షానికి నష్టపోయిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు రుణమాఫీ, పంట పెట్టుబడి కోసం ఎకరాకు రూ.15వేలు, కౌలు రైతులకు రూ. 12వేలు ఇస్తామని చెప్పి తీరా గెలిచిన తర్వాత ఆ హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేశామని అసెంబ్లీలో ప్రకటన చేయడం సిగ్గు చేటన్నారు. ప్రస్తుతం రైతులు అకాల వర్షంతో పంటలు దెబ్బతిని లబోదిబో మంటున్నారని, వ్యవసాయాధికారులు వెంటనే పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా చాలా చోట్ల పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయని వాటికి కరెంట్ సమస్య తీవ్రంగా వేధిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు బోనస్ ఇస్తామని చెప్పి వడ్లు కోసు గోటు చేసి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో బోనస్ ఇవ్వలేదని ప్రభుత్వం స్పందించి వందశాతం రుణమాఫీ చేయడంతోపాటు బోనస్ చెల్లించాలని, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెద్దదర్పల్లి గ్రామానికి చెందిన నాగరాజ్ హైదరాబాద్‌లో ప్రమాదశాత్తు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, మాజీ సర్పంచులు చెన్నయ్య, వెంకన్న, మాజీ ఎంపీటీసీ పెద్దచెన్నయ్య, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు రాజుయాదవ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు హరి చందర్, నాయకులు జంబులయ్య, శ్రీనివాసులు, అనంతరెడ్డి, మాధవులు గౌడ్, అంజి, రామకృష్ణ ఉన్నారు.

రూ.1.20 లక్షల పెట్టుబడి అయ్యింది..

నాకున్న మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. పంట సాగు కోసం రూ.లక్షా 20 వేలు పెట్టుబడి అయ్యింది. చేతికొచ్చే సమయంలో అకాల వడగండ్ల వర్షానికి పంట పూర్తిగా దెబ్బ తిన్నది. దీంతో పంట కోసం తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి. ఇప్పటి వరకు పెట్టుబడి కూడా రాలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మామీలను చూసి మోసపోయి ఓటు వేసిన పాపానికి ఇప్పుడు అనుభవిస్తున్నాం.

- పాశం నారాయణ, రైతు, నాయినోనిపల్లి

ఉమ్మడి జిల్లాలో రైతన్నల ఆందోళన

వరి ఎండి.. గుండె పగిలి..

- గిట్ల అయితదనే ఎవుసమే చేయకుంటి..
- కౌలు డబ్బులు ఎట్ల తిరిగి కట్టాలో..
- తల్సుకుంటే కండ్లల్లో నీళ్లొస్తున్నయ్
- పోమాల రైతు గొడుగు కృష్ణయ్య ఆవేదన

నవాబ్‌పేట, మార్చి 25 : 'ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసి కొని సాగు చేసిన వరి పంట కండ్ల ముందే ఎండి పోతుంటే కండ్లలో నుంచి నీళ్లొస్తున్నయ్.. గిట్ల నీటి కరువు వస్తదని ముందే తెలిస్తే.. ఎవుసమే చెయ్యకుంటి.. ఇప్పుడు కౌలు డబ్బులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు.. మా ఊరి రైతు వద్ద మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వరి వేసిన. దీంతోపాటు నాకున్న ఎకరా 20 గుంటల్లో నూ వరి పంట వేసిన. కౌలు పొలంలో నీళ్లు బాగానే ఉన్నాయని రెండు నెలల కిందట పంట వేస్తే.. 20 రోజుల నుంచి బోరులో నీళ్లొస్తలేవు.. ఇప్పటికే రెండు కరాల్లో పంట ఎండింది. ఎకరాకు మాత్రం తడి కడుతున్నా.. నా పొలంలో వేసిన పంట కూడా ఎండుముఖం పట్టింది. దీంతో చేసేది లేక కౌలు పొలంలో పంటను మేతకు వదిలేశాం. నాలుగేండ్ల కిందట 180 ఫీట్లు బోరేస్తే నీళ్లు పుల్‌గా వచ్చాయి.. ఈతాపే దరిద్రంగా తయారైంది.. పంట పెట్టుబడికి రూ.1.10 లక్షలు ఖర్చు చేశాను. తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో అర్థమైత లేదు.' అంటూ మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం పోమాల గ్రామానికి చెందిన రైతు గొడుగు కృష్ణయ్య, అతడి భార్య పావని ఆవేదన వెళ్లగక్కారు.

నవాబ్‌పేట మండలం పోమాల శివారులో ఎండిన పంట పొలంలో ఆవును మేపుతూ దిగాలుగా ఉన్న రైతు గొడుగు కృష్ణయ్య, అతడి భార్య పావని

మరికల్ మండలం పల్లెగడ్డ శివారులో ఎండిన వరి పంట

ఎక్కడికక్కడ ఎండుతున్న పంటలు

మరికల్, మార్చి 25 : వేసవి తాపానికి భూగర్భజలాలు అడుగంటి పోవడంతో చేతి కొచ్చిన పంటలు ఎండు మొఖం పడుతున్నాయి. దీంతో రైతులు కష్టాల కొలిమిలో కొట్టు విట్టాడుతున్నారు. మరికల్ మండలంలోని పల్లెగడ్డకు చెందిన రైతు గుర్రాల శ్రీనివాసులు తనకున్న ముడెకరాల్లో వరి పంట సాగు చేశారు. మరో 20 రోజుల్లో పంట చేతికోస్తుందని ఆశించినా ఆ రైతుకు ఉహించని దెబ్బపడింది. రెండు రోజుల్లోనే బోరులో నీరు తగ్గిపోవడంతో చేతి కొచ్చిన వరి పంట పశువుల పాలైంది. పంటను కాపాడు కోవడానికి రూ.లక్ష అప్పుతెచ్చి నూతనంగా మూడు బోర్లు వేసినా నీరు రాక పోవడంతో చేసేది లేక వరి పంటను పశువుల మేతకు వదిలేశారు. పంట సాగుతోపాటు బోర్లు వేయడానికి యాసంగిలో మొత్తం రూ.రెండు లక్షల అప్పు చేయాల్సివచ్చింది. అప్పుల ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్సులు ఆపాలని..

బస్సు ఆపి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అమరచింత, మార్చి 25 : మండలంలోని మిట్టనందిమళ్ల గ్రామం మీదుగా నారాయణపేట జిల్లా కేంద్రం నుంచి జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్టీసీబస్సును రోజూ డ్రైవర్ గ్రామంలో ఆపకుండా వెళ్తున్నాడని మంగళవారం గ్రామస్తులు బస్టాండ్ సమీపంలో రోడ్డుపై బస్సును నిలిపివేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సర్వారెడ్డి, గ్రామస్తులు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చివరగా ఉన్న మిట్టనందిమళ్ల గ్రామం మీదుగా రోజుకు రెండుసార్లు నారాయణపేట నుంచి గద్వాలకు, తిరిగి నారాయణపేట వెళ్తుందన్నారు. మహిళలు, పిల్లలు పాఠశాలలకు, లేదా మండల కేంద్రానికి చేరుకోవాలంటే 4కిలోమీటర్ల దూరంలో జూరాల ప్రాజక్టు వరకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు మాత్రమే ఉందని, తమ గ్రామం మీదుగా వెళ్లే బస్సును డ్రైవరు అపకుండా పోవడం ఏమిటన్నారు. దీంతో రోడ్డుపై ఆందోళన చేపట్టిన విషయం డిపో అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. స్పందించిన అధికారులు ఇకనుంచి నిత్యం బస్సును నిలిపేలా చర్యలు తీసుకుంటామని ఫోన్‌లో చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

తాటికొండలో ఏడాదిగా భగీరథ నీళ్లు బంద్

భూత్పూర్, మార్చి 25 : మండలంలోని తాటికొండ కుర్వ గేరీలో ఏడాది నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ సర్కారులో నట్టింటికి నల్లా నీళ్లు తీసుకురాగా, నేడు కాంగ్రెస్ సర్కారులో తాగునీరు రాక పొలాల వెంట బిందెలు తీసుకెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని మండిపడుతున్నారు. ఏడాది పైనా నీళ్లు రాకపోతే ఎలాగని ప్రశ్నించారు. మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డిని కలిసి తాగడానికి నీళ్లు లేవని అడిగితే సొంత డబ్బులతో కొత్త బోరు మోటర్‌ను ఇప్పించి కొంత దాహం తీర్చారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, సర్కారు స్పందించి మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అతికష్టం మీద..

- ఎస్ఎల్‌బీసీలో మరో డెడ్ బాడీ
- యూపీకి చెందిన ఇంజినీర్ మనోజ్‌గా నిర్ధారణ
- నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో పోస్టుమార్టం

నాగర్‌కర్నూల్ నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

మనోజ్‌కుమార్(ఫైల్)

నాగర్‌కర్నూల్, మార్చి 25: నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట ఎల్ఎల్‌బీసీ టన్నెల్‌లో మంగళవారం మరో మృతదేహాన్ని వెలికి తీశారు. సోమవారం రాత్రి మినీ జేసీబీతో మట్టిని తొలగిస్తుండగా దుర్గంధం రావడంతో రెస్క్యూటీం స్పేర్ కొట్టి అతికష్టమ్మీద ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్‌కుమార్ మృతదేహాన్ని వెలికి తీశారు. గతనెల 22వ తేదీన సొరంగంలో పనులు చేసేందుకు వెళ్లిన వారిలో మట్టిదిబ్బలు కూలడంతో నలుగురు కార్మికులు, ఇద్దరు టీబీఎం మిషన్ ఆపరేటర్లు, ఇద్దరు ఇంజినీర్లు సొరంగంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఘటన జరిగిన రెండు వారాల తర్వాత మార్చి 9వ తేదీన మిషన్ ఆపరేటర్ పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్‌సింగ్ మృతదేహం వెలికి తీయగా, మంగళవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్‌కుమార్ మృతదేహాన్ని రెస్క్యూటీమ్ గుర్తించి బయటకు తీశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉన్నావ్ జిల్లా బంగార్మ గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీలో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య స్వర్ణలత, కుమారుడు ఆదర్శ్, కుమార్తె శైలజ, తల్లి జమునాదేవి ఉన్నట్లు కంపెనీ యాజమాన్యం పేర్కొన్నది. మనోజ్‌కుమార్ మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం ప్రభుత్వం తరుపున రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి చేతుల మీదుగా రెవెన్యూ అధికారులు, కంపెనీ ఉద్యోగులకు అందజేసి ఉత్తరప్రదేశ్‌కు పంపించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ రఘు, డీఎం హెచ్‌వో స్వరాజ్యలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్సై గోవర్ధన్, తాసీల్దార్ తబిత ఉన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

- లాయర్ హత్యకు నిరసనగా ఉమ్మడి జిల్లాలో కోర్టు విధుల బహిష్కరణ

మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మహబూబ్‌నగర్/జడ్చర్లటౌన్/ కల్వకుర్తి, మార్చి 25 : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయలని మహబూబ్‌నగర్ న్యాయవాదుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సోమవారం న్యాయవాది ఎర్ర బాబు ఇజ్రాయిల్‌ను హత్య చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డి, న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు చంద్రమౌళి న్యాయవాదులు అనిల్‌కుమార్, అనంతరెడ్డి, రవికుమార్ యాదవ్, పుట్టపాగ రఘుపతి, నరేందర్ గౌడ్, కాంతారెడ్డి, వెంకటేశ్, జాకీర్‌హుస్సేన్, ఉమామహేశ్వరి, జ్యోతి, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జడ్చర్లలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జడ్చర్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జంగయ్య, న్యాయవాదులు మాలిక్‌షాకీర్, యాదిరెడ్డి, రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, విశ్వేశ్వర్, ఇష్తేకారోద్దీన్, రమేశ్, రాములు, తిరుపతి, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, హాజీరవుఫ్ పాల్గొన్నారు. కల్వకుర్తి కోర్టులోనూ న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు.

పేదలకు చీరలు, పంచెలు పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న శ్రీరామ సంస్థల ఎండీ బెక్కరి రాంరెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 25 : బెక్కరి బాలకిష్టారెడ్డి వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు చీరలు, పంచెలను శ్రీరామ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బెక్కరి రాంరెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీకే రెడ్డి కాలనీలో పాలమూరు రెడ్డి సేవాసమితి మినీ పంక్షన్ హాలులో శ్రీరామ జయరామ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బెక్కరి రాంరెడ్డి తన తండ్రి బెక్కరి బాలకిష్టారెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఉచితంగా 400మంది నిరుపేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెక్కరి జయలక్ష్మి, యమున, విజయ, పాల మూరు రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, నాయకులు వేపూరు రాజేందర్‌రెడ్డి, వెంకట రామిరెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, సరసయ్య, సమన్వయకర్త రమేశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- జడ్చర్ల ఏరియా దవాఖాన ఎదుట కార్మికుల ధర్నా

జడ్చర్ల టౌన్, మార్చి 25 : ఆరు నెలల పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని జడ్చర్ల ఏరియా దవాఖానలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం జడ్చర్ల ఏరియా దవాఖాన ఎదుట పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ, పేషెంట్‌కేర్, సూపర్ వైజర్లు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా ఏరియా సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ, పేషంట్ కేర్, సూపర్ వైజర్ల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. గత ఆరు నెలల పెండింగ్ వేతన బకాయిలను ఫిబ్రవరి 18న విడుదల చేసినా నేటికీ కార్మికులకు చెల్లించకపోవడంపై మండిపడ్డారు. ఉగాది, రంజాన్ పండుగ నేపథ్యంలో వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, నాగరాజు, నవీన్, రాజేశ్, రామకృష్ణ, విజయలక్ష్మి, మణెమ్మ, అలివేలు, సుక్కమ్మ, భార్గవి, అంజమ్మ, నీరజ ఉన్నారు.

పంటనష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

సంకిరెడ్డిపల్లిలో పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, మార్చి 25 : ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగండ్ల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం కొత్తకోట మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లిని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అకాల వర్షంతో నష్టపోయిన వరి పంటలను కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్‌తో కలిసి పరిశీలించారు. గ్రామంలోని వెంకట్రాములు అనే రైతు పొలాన్ని సందర్శించి రైతుతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంకిరెడ్డిపల్లి గ్రామంలో మొత్తం ఎన్ని ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని కలెక్టర్ ఆరా తీయగా, వ్యవసాయశాఖ సర్వే చేసిన ప్రకారం 170 ఎకరాల మేరకు పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో వడగండ్లు, అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా వ్యవసాయశాఖ అధికారి, రైతులను నుంచి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి పూర్తి వివరాలు నివేదిస్తామని ఆయన తెలిపారు. కలెక్టర్ వెంట పలుశాఖల అధికారులు ఉన్నారు.